క్లుప్తంగా

రహదారులపై చెత్త వేస్తే జరిమానా

బొబ్బిలి: మున్సిపల్ రహదారులపై చెత్త వేస్తున్న వారికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని మల్లమ్మదేవి పార్కు గాంధీ బొమ్మ, ఆకులరెల్లి వీధుల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గాంధీ బొమ్మ వీధుల్లో రహదారులపై చెత్త ఉండడంతో ఆరా తీశారు. చెత్త బళ్లకు చెత్తను అందించేలా స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మల్లమ్మదేవి పార్కులో మొక్కల ట్రిమ్మింగ్, మరుగుదొడ్ల పరిశుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, ఎన్విరాన్‌మెంటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జానపద కళాకారుల దినోత్సవం



దప్పు వాయిద్యంతో జానపద గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

వంగర: మండల కేంద్రం వంగరలో ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో వివిధ రకాల జానపద నృత్యాలు వేసి గీతాలను కళాకారులు ఆలపించారు. డప్పు వాయిద్యం, జానపద ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు. జానపదాలను రక్షించుకోవలసిన ఆవశ్యకత అందరిపై ఉందని కళాకారులు వెల్లడించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జానపద కళాకారులు పాల్గొన్నారు.

రాజాంలో ఆరు బార్లకు దరఖాస్తులు



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ సీఐ

రాజాం : రాష్ట్ర వ్యాప్తంగా 2025–28 సంవత్సరాలకుగాను నూతన బార్ పాలసీని విడుదల చేసినట్టు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ రాజాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు. శుక్రవారం రాజాంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ బార్ పాలసీలో రాజాం నగర పంచాయతీలో ఆరు బార్లకు నోటిఫికేషన్ వచ్చిందన్నారు. ఇందులో ఒకటి గీత కార్మికుల కులాలకు 50 శాతం రాయితీతో ఇవ్వనున్నట్టు తెలిపారు. నూతన బార్లకు దరఖాస్తు చేసుకునే వారంతా ఈ నెల 29లోగా రాజాం ఎక్సైజ్ కార్యాలయంలోగానీ, జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కార్యాలయంలోనైనా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 28, 30 తేదీలలో లాటరీ పద్ధతిలో ఎంపిక జరుగుతోందని, ఆసక్తి కలిగిన వారంతా నాన్ రిఫండబుల్ ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లించాలని వెల్లడించారు. మిగిలిన వివరాలకు రాజాం కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9000248926 నంబరును సంప్రదించాలని సూచించారు.

వీవీఆర్ పేటను పార్వతీపురంలో విలీనం చేయాలి



మాట్లాడుతున్న వి.వి.ఆర్.పేట గ్రామస్తులు

వంగర: మండలంలోని వి.వి.ఆర్.పేట పంచాయతీని పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా రామమందిరం వేదికగా సమావేశమయ్యారు. తమ గ్రామానికి 20 కిలోమీటర్ల దూరంలో పార్వతీపురం జిల్లా కేంద్రం ఉందని, ప్రస్తుతం ఉన్న విజయనగరం 110 కిలోమీటర్లు దూరంలో ఉందని వెల్లడించారు. విజయనగరం వెళ్లాలంటే 220 కిలోమీటర్లు దూరం వెళ్లి రావలసి వస్తుందని పేర్కొన్నారు. నిత్యం వైద్యం, వ్యాపార, వాణిజ్య అవసరాలకు పార్వతీపురం వెళ్తుంటామని, పాలన పరంగా తమకు అనుకూలమని వెల్లడించారు. సమస్యను అవసరమైతే అమరావతిలోని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళదామని వారంతా నిర్ణయించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

తెర్లాం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని యూత్ క్లబ్ బెజ్జిపురం ఎన్‌జీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాదరావు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం – 1లో ప్రభుత్వ పథకాలు-వాటి అనుసంధానంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, బాలల హక్కులు, విధులపై అన్ని శాఖల అధికారులు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ బోనెల రూప మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. వివిధ శాఖల నుంచి హాజరైన మండల స్థాయి అధికారులంతా వారి శాఖలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించారు. సదస్సులో యూత్ క్లబ్ బెజ్జిపురం ఎన్‌జీవో సీహెచ్.హరీష్, వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరరావు, ఉపాధి ఏపీవో సుశీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



బొబ్బిలి: విశేష అలంకరణలతో దాడితల్లి అమ్మవారు



బొబ్బిలి: కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

శ్రావణమాసం చివరి శుక్రవారం భక్తులు వైభవంగా పూజలు నిర్వహించారు. విశేష అలంకరణలతో అమ్మవారిని తీర్చిదిద్దారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూల దండలను అలంకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



బాడంగి: శివాలయంలో వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన ఉమాదేవి



రేగిడి: దుర్గాదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం శోచనీయం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: దివ్యాంగులకు ఉన్న ఏకైక జీవనాధారం పింఛను అని, దీన్ని కూటమి సర్కారు తొలగించడం శోచనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. పూర్తి అర్హత ఉన్నా పింఛన్ తొలగించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆరోపించారు. సంక్షేమ పథకాల్లో కోత పెట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. తొలగించిన అన్ని రకాల పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల పార్టీ ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కె.అప్పారావు, ఎస్.రామారావు ఉన్నారు.

దివ్యాంగులపై కూటమి కక్షసాధింపు



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తోందని ఎంపీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా అధికార ప్రతినిధి ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ వెల్లడించారు. వంగరలో విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లో లక్షలాది పెన్షన్లు రద్దు చేశారని తెలిపారు. అంగ వైకల్యంతో కూడిన ధ్రువీకరణ పత్రాలు పొందిన దివ్యాంగుల పెన్షన్లు రద్దు చేసి వారిని రోడ్డెక్కించి దొంగలుగా చిత్రీకరించడం దారుణమన్నారు. దివ్యాంగుల పక్షాన ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. పీ–4 నిర్వహణకు ఉద్యోగులపై ఒత్తిడి పెంచడం తగదన్నారు. ఇంత వరకు పీ–4 కింద ఎన్ని కుటుంబాలను దత్తత తీసుకున్నారో ప్రభుత్వం తెలపాలని ప్రశ్నించారు.

25న మహాధర్నా

బొబ్బిలి: డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 25న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహాధర్నా పోస్టర్‌ను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ 2003 ఉపాధ్యాయ, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెమో 57ను అమలు చేయడంలో ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న విజయవాడ అలంకార్ నందు మహాధర్నా చేపడుతున్నామని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ ఎస్.రవి, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉసురు తగులుతుంది

బొబ్బిలి: సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరుతో లక్షలాది మంది దివ్యాంగుల పెన్షన్లను నిలిపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని, దివ్యాంగులపై కక్షగట్టినట్లు పింఛన్లను తొలగిస్తే వారి ఉసురు తగులుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మువ్వల శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం తన కార్యాయలంలో విలేకరులతో మాట్లాడారు. అధికారం రాక ముందు ఒక మాట వచ్చాక మరోమాట మార్చుతున్న ప్రభుత్వ తీరుపై ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుందన్నారు. గత ప్రభుత్వంలో అన్ని పరీక్షలు జరిపిన తరువాతే వారికి సర్టిఫికెట్లు అందాయని వాటితో అర్హత గల వారు దివ్యాంగ పింఛన్ పొందుతున్నారని, ప్రభుత్వం మారితే అధికారులు, వైద్యులు మారిపోతారా, వారిచ్చిన సర్టిఫికెట్లు మారుతాయా అని ప్రశ్నించారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా వినాయక చవితి జరపాలి



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ నారాయణరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ ప్రసాదరావుతో కలిసి శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాలలో పందిర్లు, మండపాలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా పోలీస్‌స్టేషన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహాలను మండపాలకు తీసుకొచ్చినప్పుడు, నిమజ్జన సమయాలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే వారు వాటి కోసం ప్రత్యేకంగా అనుమతులు పొందాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఘర్షణలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వినాయక విగ్రహాల పంపిణీ

బొబ్బిలి: పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారు చేసే వినాయక విగ్రహాలను పూజలకు వినియోగించవద్దని, మట్టి గణపతి విగ్రహమే మేలని ఎస్‌టీవో పి.వి.పద్మనాభం సూచించారు. టీఆర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్‌టీవో చేతుల మీదుగా స్థానికులకు మట్టిగణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. సాంప్రదాయ పద్ధతిలో మట్టి గణపతినే పూజలకు వినియోగించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎస్‌టీవో పద్మనాభం

ఎట్టకేలకు తోటపల్లి కాలువ ద్వారా నీరు



పనసలవలస వద్ద తోటపల్లి కాలువ ద్వారా వస్తున్న సాగునీరు

రేగిడి: మండలంలోని పలు గ్రామాలకు తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు శుక్రవారం నాటికి చేరుకుంది. కొర్లవలస, బూరాడ, లచ్చన్నవలస తదితర గ్రామాలకు నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు తోటపల్లి సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులు పత్రికల్లో ప్రచురించడంతో అధికారులు స్పందించి అధికారులతో మాట్లాడి మండలానికి తోటపల్లి సాగునీరు అందేవిధంగా చర్యలు చేపట్టడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ప్రాధాన్యత ప్రకారంగా తోటపల్లి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మలిపొద్దు.. కనువిందు..!

రేగిడి మండలం వన్నలి గ్రామ సమీపంలో శుక్రవారం సూర్యాస్తమయం కనువిందు చేసింది. నీలిమేఘాల చాటు నుంచి లేలేత పసుపు రంగులో భానుడు ఇంటికి చేరుతూ కనిపించాడు. పచ్చని పైరుపై ఈ అందాలు చూపరులకు కనువిందు చేశాయి.

- రేగిడి



బాబు ష్యూరిటీ.. అంతా బూటకం

- మాజీ ఎమ్మెల్యే శంబంగి



నాయుడుకాలనీలో చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఎన్నికల ముందు బాబు ష్యూరిటీ పేరుతో ఇచ్చిన బాండ్లన్నీ ఫేక్ బాండ్లేనని, అంతా ఓ బూటకమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. మున్సిపాలిటీలోని 21వ వార్డు నాయుడు కాలనీలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లారు. చంద్రబాబు అండ్‌కో కూటమి ప్రభుత్వం చేస్తోన్న మోసాలను వివరించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన బాండ్లలో ఒక్కటి అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఉన్న పథకాలను తొలగిస్తున్నారని వేలాది మంది దివ్యాంగులు ఇప్పుడు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలో ఏ ఒక్కటైనా నెరవేర్చిందా అని ప్రజలను అడిగారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీకృష్ణ, వార్డు ఇన్‌చార్జ్ చంద్రపూడి రమేష్, నియోజకవర్గ ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు బలగ సాయికృష్ణ, రుత్తల నాగేశ్వరావు, యువజన విభాగం అధ్యక్షుడు బి.శంకర్రావు, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ అన్వర్‌భాష, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఎస్‌బీఐ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి రీజనల్ మేనేజర్ సాహు

వంగర: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువస్తున్నామని బొబ్బిలి ఎస్‌బీఐ శాఖ రీజనల్ మేనేజర్ బి.బి.సాహు అన్నారు. శుక్రవారం మండల పరిధి కె.కొత్తవలస గ్రామంలో లోన్‌మేళా, గ్రామ స్థాయి జన సురక్ష బీమా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఖాతాదారులకు ఎస్‌బీఐ రూ.436, రూ.20 రూపాయులు రెండు రకాల బీమా పాలసీలను అమలు చేస్తున్నామని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే వివిధ వృత్తులు, రైతులు, వాణిజ్య, వ్యాపార రంగాలకు అవసరమైన రుణ సౌకర్యం బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ మేనేజర్ ఈశ్వరరావు, వంగర బ్రాంచి మేనేజర్ దేవి వరప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: వచ్చే నెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులన్నీ పరిష్కరించనున్నామని అన్నారు. న్యాయవాదులు, పోలీసులు లోక్‌అదాలత్‌కు సహకరించి వీలైనన్ని కేసులను పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు కూడా వాపసు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ, బార్ అసోసియేషన్ కార్యదర్శి బి.తిరుపతినాయుడు, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాస్, కె.రమణమూర్తి, ఆర్.రామమూర్తినాయుడు, జె.అప్పలనాయుడు, వైఎస్ శ్రీనివాస్, ఎస్.అప్పలనాయుడు, కె.కొండలరావు, ఎస్.జయలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

శాంతి ర్యాలీ

రాజాం సిటీ: సర్వమానవాళి శాంతిని కాంక్షిస్తు మానవతా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ జంక్షన్ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకు సాగిన ఈ ర్యాలీలో ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ నినాదాలు చేశారు. పండగలకు డీజేల వాడకం వలన కలిగే అనర్థాలను టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ వివరించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మానవతా సంస్థ చైర్మన్ కె.సాయిప్రశాంత్‌కుమార్, అధ్యక్షులు బీవీ అచ్యుత్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వప్నహైందవి, రోటరీ అధ్యక్షులు గట్టి పాపారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలియుగ నామస్మరణ జీవన్ముక్తికి సోపానం

రేగిడి: కలియుగ నామస్మరణ జీవన్ముక్తికి సోపానమని సత్యసాయి వక్త పడాల ప్రసాదరావు అన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం రేగిడి గ్రామంలో వెలసిన విశ్వసాయి మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కన్వీనర్ లావేటి విష్ణు, డీవీఎస్ శ్రీనివాస్, సీమకుర్తి ప్రసాద్, మామిడి శివప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా యూరియా పిచికారీ

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట గ్రామంలో శుక్రవారం డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ చేసే విధానంపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన రైతు పోతల ధర్మారావు పొలంలో ఈ ప్రయోగం నిర్వహించారు. వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు, సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, రైతుసేవా కేంద్రం అసిస్టెంట్ జోత్స్న, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

రాజాం సిటీ: మహిళలు అప్రమత్తంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణ పరిధి కాకర్లవీధిలో మహిళలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలని తెలిపారు.

రుచికరమైన భోజనాలను అందించాలి

బొబ్బిలి రూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో వండి, రుచికరమైన భోజనాలను అందించాలని ఎంఈవో సిహెచ్ రమేష్ సూచించారు. మండలంలోని రంగరాయపురం, పెంట జెడ్పీ పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎం వేణుగోపాలరావు ఉన్నారు.

మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోతే చర్యలు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోయినా, దుర్గంధం వెదజల్లినా, విద్యార్థులు వినియోగించేందుకు సక్రమంగా లేకపోయినా సంబంధిత స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదని ఎంఈవో త్రినాధరావు అన్నారు. మండలంలోని లోచర్ల ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఎంఈఓ-2 పాపారావు ఉన్నారు.

అనుమతులు తప్పనిసరి

తెర్లాం: వినాయక చవితి సందర్భంగా మండలంలో ఏర్పాటు చేయనున్న గణేష్ మండపాలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకలకు తప్పనిసరిగా ముందుగా ఓ కమిటీని నియమించుకోవాలని, వినాయక విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేస్తారో ఆ స్థలానికి అనుమతి తీసుకోవాలని సూచించారు.

రసాయన ఎరువులతో నేలకు నష్టం

రామభద్రపురం: రైతన్నలు రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం వల్ల నేలకు నష్టం జరుగుతుందని ఏవో ఎం.శివ పేర్కొన్నారు. మండలంలోని ఆరికతోటలో శుక్రవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి నేల సారవంతాన్ని ఏ విధంగా కాపాడుకోవచ్చో తెలిపారు.

ఎంఈవోల తనిఖీ

రాజాం : మండలంలో ఆగూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవోలు బి.ప్రవీణ్ కుమార్, యాగాటి దుర్గారావు శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల వివరాలు, వసతి వివరాలు సేకరించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. పాఠశాల స్థాయిని గుర్తించి, నివేదికలు తయారు చేశారు. హెచ్‌ఎం బి.అప్పలస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

రాజాం : పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలో పెనుబాక గ్రామంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటి వద్ద పరిశుభ్ర వాతావరణం ఉండాలని వెల్లడించారు. పంచాయతీ సర్పంచ్ బండి బోడమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు గీతా పారాయణం చేయాలి

రాజాం : ప్రతీ ఒక్కరు గీతా పారాయణం చేసి, జీవిత సత్యాలు తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ సభ్యులు రామినాయుడు అన్నారు. శుక్రవారం రాజాంలోని పాలకొండ రోడ్డులో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి నవరాత్రల ఉత్సవాల్లో పాల్గొన్నారు. భక్తులు పాల్గొన్నారు.

చట్టాలపై బాలికలకు అవగాహన అవసరం

రాజాం : మహిళా చట్టాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, అక్రమ రవాణా తదితర అంశాలపై బాలికలకు అవగాహన అవసరమని శక్తి టీమ్ రాజాం ఎస్ఐ కె.శేఖర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలో పొగిరి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు శక్తి టీం తరపున అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బాలికల రక్షణ చట్టాలను వివరించారు. అనంతరం శక్తి టీం ఉమెన్ పోలీస్‌లు సీహెచ్. జగదీశ్వరి, వరలక్ష్మి విద్యార్థినిలకు పలు అంశాలు వివరించారు. హెచ్‌ఎం బి.పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

యూనివర్సిటీ సినిమా సమాజానికి ఓ సందేశం



టీబీఆర్ థియేటర్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న శంబంగి

బొబ్బిలి: ప్రముఖ దర్శక, నిర్మాత, నటుడు ఆర్.నారాయణమూర్తి దర్శకత్వంలో శుక్రవారం విడుదలైన యూనివర్సిటీ సినిమా ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. స్థానిక టీబీఆర్ థియేటర్‌లో అభిమానులు, కార్యకర్తలతో కలసి యూనివర్సిటీ సినిమాను ఆయన వీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో రాజకీయ వ్యవస్థ ఎలా భ్రష్టు పట్టిందో కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. ఉన్నత విలువలు పాటించాల్సిన రాజకీయ నాయకులు ఎలా తయారయ్యారో ఈ చిత్రం ద్వారా వివరించారన్నారు. విద్యా వ్యవస్థలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను క్లుప్తంగా ప్రేక్షకులకు అర్థమయ్యేగా చూపించారని దర్శకులు నారాయణమూర్తిని అభినందించారు.